ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రజల సమస్యలు వింటున్న వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): గడచిన నాలు గున్నరేళ్లల్లో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు, అభివృద్ధి పనులు చేస్తున్నాం కాబట్టే ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి మాత్రమే ఉందని మాజీ మంత్రి, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని 63వ డివిజన్ న్యూరాజీవ్ నగర్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సుమారు 270 గడపలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. న్యూరాజీవ్‌నగర్, రాధానగర్‌కు గత కొన్ని రోజులుగా నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెప్పగా వెంటనే వెలంపల్లి శ్రీనివాసరావు వాటర్ సరఫరా విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శ్రీనివాసరావుతో ఫోనులో మాట్లాడి ఆ ప్రాంతాలకు నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తే చంద్రబాబు నాయుడు కోర్టు కెళ్లి అడ్డుకున్నాడని, మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలను పునరుద్ధరిస్తామన్నారు. రాత్రి సమయాల్లో టీడీపీ కార్యకర్తలు ముఖాలకు ముసుగులు వేసుకుని వైఎస్సార్‌సీపీ స్టిక్కర్లను చింపివేస్తున్నారని, పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలన్నారు. స్థలాలను కబ్జా చేయడం, రౌడీయిజం చేయడం టీడీపీ నాయకులు బొండా ఉమా, అతని అనుచరులు చేసే పనులన్నారు. టీడీపీకి ప్రజలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా 63వ డివిజన్‌ను నిర్లక్ష్యం చేసిందని, ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ డివిజన్‌లో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ గణేష్, డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి యేసు, టిక్యం కృష్ణ, సీహెచ్ రవి, పెద్దిరెడ్డి శివారెడ్డి, మహిళా నాయకురాలు సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మాజీ మంత్రి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 26వ డివిజన్ చుట్టుగుంట కాలువ గట్టు ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల గొల్లభామతో కలిసి ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు పథకాల లబ్ధిదారులు అవ్వాతాతలు హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలికారు.

బొండా ఉమది అవకాశవాద రాజకీయం

టీడీపీ నాయకులు బొండా ఉమా అవకాశ వాది అని వెలంపల్లి శ్రీనివాసరావు దుయ్యబట్టారు. కోవిడ్ సమయంలో తమ పార్టీ నేతలు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల్లోకి వచ్చి సేవలు అందించారని గుర్తు చేశారు. అప్పుడు చంద్రబాబు, బొండా ఉమా ప్రాణ భయంతో ఇళ్లలో దాక్కున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉండగా ఉమా ప్రజలకు ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.



వెలంపల్లికి హారతి ఇస్తున్న వృద్ధురాలు

కాలువగట్టు వాసులకు అండగా ఉంటాం

టీడీపీ నేతలు ఎప్పుడూ కాల్వగట్లను తొలగించి అందినకాడికి దండుకుందామా అనే ధోరణిలో పనిచేశారని, తాము మాత్రం కాల్వ గట్ల వాసులకు అండగా నిలిచామని గుర్తు చేశారు. తాము చేసిన సేవలను చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు లీగల్ సెల్ అభినందన

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ విజయవాడ నగర అధ్యక్షునిగా నియమితులైన ఎమ్మెల్యే మల్లాది విష్ణును బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పుష్ప గుచ్ఛం, దుశ్శాలువతో విష్ణును సత్కరించారు. విష్ణుకు అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. నగరంలో పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా మల్లాది విష్ణు తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఒగ్గు గవాస్కర్, సీనియర్ న్యాయవాదులు అబ్రహాం లింకన్, రాంబాబు, దాసరి ఆంజనేయప్రసాద్, చంద్రమౌళి, విఠల్ రావు, రాము, ఆదాం, ఉషాజ్యోతి, బూదాల సౌమ్య, జయలక్ష్మి, నరహరిశెట్టి జ్యోతి, శ్రీరామచంద్రమూర్తి, రవి, నిరంజన్, కౌండిల్య చక్రవర్తి తదితరులు ఉన్నారు.



మల్లాది విష్ణును సత్కరిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ సభ్యులు

మహిళలతోనే సమగ్రాభివృద్ధి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని వాకర్స్‌క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ యర్రంశెట్టి దుర్గా భవానిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వసంతకుమార్ మాట్లాడుతూ సేవా రంగంలో తనదైన శైలి లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దుర్గా భవానిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు, సభ్యులు వి.విశ్వేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



యర్రంశెట్టి దుర్గాభవానిని సత్కరిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

పోస్ట్ కోవిడ్ రోగులకు వైద్యుల సలహాలు తప్పనిసరి

ఆటోనగర్(విజయవాడతూర్పు): కరోనా వచ్చిన వారంతా భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉండేందుకు తప్పని సరిగా వైద్యుల సూచనలు తీసుకోవడం మంచిదని అమెరికాకు చెందిన బయో అమెరికా రీసెర్చ్ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. ఆటోనగర్‌లోని విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాలులో మంగళవారం సాయంత్రం వ్యాధి నిరోధక శక్తి, కోవిడ్-19 ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కరోనా వచ్చిన వారు గత రెండు సంవత్సరాల నుంచి అధికంగా గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. లంగ్స్, ఊపిరితిత్తులతో పాటు పలు అవయవాలకు కూడా ముప్పు వాటిల్లుతోందన్నారు. కరోనా వచ్చిన తర్వాత శరీరంలో అనారోగ్య పరిస్థితులు వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు, అసోసియేషన్ కార్యదర్శి టీవీ నాగేశ్వరరావు, జేఆర్‌డీ టాటా ఐలా కార్యదర్శి టి.శ్రీనివాసరావు, ఏపీ ఎంఎస్ఎంఈపీ కార్యదర్శి ఎంఎస్ రామచంద్రరావు పాల్గొన్నారు.



ప్రొజెక్టర్ ద్వారా వివరిస్తున్న శ్రీనివాసరావు

బీసీలు ఐక్య పోరాటం చేయాలి



యనమలకుదురులో మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

పెనమలూరు: రాజ్యాధికారంలో భాగస్వామ్యం అయ్యేందుకు బీసీలు ఐక్య పోరాటం చేయాలని ఏపీ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ద్రాక్షరపు సూరిబాబు పిలుపునిచ్చారు. యనమలకుదురులో మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్‌లో భారతరత్నకు ఎంపికైన బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్‌కు ఘననివాళులర్పించి అనంతరం జరిగిన రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని ప్రసంగించారు. బీసీలు బలోపేతం కావటానికి అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. నాయీబ్రాహ్మణ సంఘం ఉద్యోగ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు ఉండవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అన్ని రంగాల్లో బీసీలు రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, అయోధ్య సత్యనారాయణ, ఆకునూరు సుబ్బారావు, మద్దిరాల ఉమాశంకర్, అవనిగడ్డ వెంకటేశ్వర్లు తెన్నేటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 29వ డివిజన్‌లో వెలంపల్లి పాదయాత్ర

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలోని 29వ డివిజన్ మధురానగర్ సాయిబాబా కాలనీ నుంచి బుధవారం వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పాదయాత్ర నిర్వహిస్తారని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, నగరపాలకసంస్థ అధికారులు వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలు వివరిస్తారని తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీవైఈఓ సీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. స్థానిక సత్యనారాయణపురం ఎస్ఆర్ఆర్ కళాశాలలో ప్రాక్టికల్స్ నిర్వహణను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ప్రాక్టికల్స్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



కంకిపాడు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. విద్యాసంస్థల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డీన్ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.మురళీకృష్ణ మాట్లాడుతూ జేఈఈ మెయిన్ సెషన్-1 ఫలితాల్లో 300 మార్కులకు 300 మార్కులను అన్నారెడ్డి వెంకట తనిష్‌రెడ్డి సాధించాడన్నారు. నూరు శాతం 14 మంది, ఫిజిక్స్‌లో 100 శాతం 12 మంది, కెమిస్ట్రీలో 22 మంది సాధించారన్నారు. 99 శాతం పర్సంటేజ్ 288 మంది సాధించారని చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యంగా బోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీన్స్ పీవీఆర్, మురళీరావు, కృష్ణారెడ్డి, శరత్ పాల్గొన్నారు.

రంజింప చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ నటరాజ సాంస్కృతిక కళాపీఠంకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను రంజింపచేసింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు పల్లవి, కణ్వల, ఉజ్వల సాయి, నిత్యశ్రీ, అనిత, జ్ఞానదీపిక, చార్వి, దీపిక, సహస్ర, నిర్వాణ పలు కీర్తనలకు చక్కటి అభినయంతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు ప్రసాదాలను అందజేశారు.

ఆర్‌యూబీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అధికారులకు సూచించారు. స్థానిక మధురానగర్ ఆర్‌యూబీ పనులను మంగళవారం ఆయన నగరపాలకసంస్థ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌యూబీ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌యూబీ పనుల వివరాలను నగరపాలకసంస్థ ఈఈ శ్రీనివాసరావు వివరించారు. డీఈ గుర్నాథం, అధికారులు పాల్గొన్నారు.



ఆర్‌యూబీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

ఐసీడీఎస్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకాపురం(విజయవాడరూరల్): సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ విజయవాడ అర్బన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశు అభివృద్ధి అధికారి డి.జ్యోత్స్న మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పడమర నియోజకవర్గం 45వ డివిజన్ న్యూ జోజినగర్ -3 ఓసీకి రిజర్వు అయిన అంగన్వాడీ సహాయకురాలు, సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్ రాజీవ్‌నగర్ -7 లో ఓసీ(ఆర్థికంగా బలహీన వర్గం)కు రిజర్వు అయిన అంగన్వాడీ సహాయకురాలు, సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్ రాజీవ్‌నగర్, వడ్డెర కాలనీలో ఓసీకి రిజర్వు అయిన అంగన్వాడీ సహాయకురాలు, సెంట్రల్ నియోజకవర్గం 59వ డివిజన్ లూనా సెంటర్-2 ఓసీకి రిజర్వు అయిన అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. దరఖాస్తు చేసే వారు 2023 జులై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాల వయస్సు నిండి 35 సంవత్సరాల లోపు ఉండాలని, స్థానికురాలైన వివాహిత మహిళా అభ్యర్థులై ఉండి, పదవ తరగతి కృతార్థురాలై ఉండాలని పేర్కొన్నారు. విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్, ఆధార్ జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్(గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్ట్ చేయించి) ప్రస్తుత పాస్‌పోర్టు సైజు ఫొటో జతపరిచి ఈ నెల 20వ తేదీలోపు ఉమాశంకర్ నగర్, 1వ లైను, ఎస్ఎస్ఆర్ అకాడమీ , కానూరు, గ్రౌండ్ ఫ్లోర్‌లో గల సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, విజయవాడ అర్బన్ కార్యాలయంలో దరఖాస్తులను వ్యక్తిగతంగా అందజేయాలన్నారు. వివరాలకు 94408 14595 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా ప్రారంభమైన కబడ్డీ, క్రికెట్ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడలలో రాణించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అజిత్‌సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో మంగళవారం విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన దేవినేని కిషోర్ కుమార్ సహకారంతో క్రికెట్, కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆయన ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహించి క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. అసోసియేషన్ చైర్మన్ వాసా బాబు, వైస్ చైర్మన్ శ్రీహరిరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు అమ్మాజీ, కార్యదర్శి షరీఫున్నీసా, కోశాధికారి ఉషారాణి, సీనియర్ సభ్యులు గోన సాంబశివరావు, మామిడి శ్రీనివాసరావు, మోహన్ రెడ్డి, స్వాతి, సాంబశివరావు, ఏపుగంటి సాయి కృష్ణ, గణేష్ బాబు, తాళ్లూరి శ్రీనివాసరావు, క్రాంతి కోటేశ్వరరావు, శ్రీరామ్ సురేష్, స్లీవా, వెనిగళ్ల మురళీమోహన్, శారా కుమారి తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

గురుకుల కళాశాల విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ



యూనిఫాంలు అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న బీకాం, బీఎస్సీ విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది సహకారంతో యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ తమ కళాశాల సిబ్బంది సహకారంతో మొత్తం 71 మంది విద్యార్థినులకు చున్నీలతో సహా రెండు జతల యూనిఫాంను ఉచితంగా అందజేసినట్లు తెలియజేశారు. పేద విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారని, వారికి యూనిఫాం ఖర్చు భారం కాకూడదనే సదుద్దేశంతో తామే సొంత ఖర్చులతో కొనుగోలు చేసి అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు అరుణ, ధనలక్ష్మి, సుధారాణి, సత్యవాణి, సుమిత్ర, లావణ్య, ప్రసాదరావు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయాల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): పేద ప్రజలకు ప్రభుత్వం నిర్మిస్తున్న టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేసి వారికి అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఆమె జక్కంపూడిలోని టిడ్కో గృహ సముదాయాలను మంగళవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపం లేకుండా నిరంతర అధికారులు నిరంతర పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. పేద మధ్యతరగతి కుటుంబాలకు సంపాదిస్తున్న వేతనంలో అద్దె రూపంలో వెళ్లిపోవటం వల్ల వాళ్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి ఇబ్బందులు దూరం చేసేందుకే పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతిల్లు కల్పించాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమన్నారు. గృహాల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



టిడ్కో గృహ సముదాయాల ప్లాన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అధికారులు

17న ఉచిత మెగా వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో ఈనెల 17న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ చర్చి పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ తెలిపారు. నగరంలోని ప్రముఖ ఆసుపత్రులకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని విజయవాడ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 94947 67633, 94947 67733 ఫోన్ చేయాలన్నారు.

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఏసీపీ బి.భాస్కర రావు, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ కేంద్రాలలోని వసతులు, శాంతి భద్రతలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి సూచించారు.

బహుముఖ ప్రతిభాశాలి పీవీ

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి పీవీ నరసింహారావు అని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. శాతవాహన కళాశాల సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో మంగళవారం పీవీ నరసింహారావుకు భారత రత్న పురస్కారం ప్రకటించిన సందర్భంగా సభను నిర్వహించారు. నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ భారత దేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన మహనీయుడు పీవీ అని అభివర్ణించారు. కళాశాల వ్యవస్థాపకుడు గుండవరపు ప్రజాపతిరావు మాట్లాడుతూ 1971లో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉండగా శాతవాహన కళాశాల నిర్వహణకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శంకరరావు, వైస్ ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

16న శ్రీసూర్య వ్రతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక కల్యాణార్థం ఈనెల 16వ తేదీ శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు అజిత్‌సింగ్‌నగర్ గుజ్జల సరళా దేవి కల్యాణ మండపంలో శ్రీ శివజ్ఞాన పీఠం ఆధ్వర్యాన శ్రీసూర్యవ్రతం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి శ్రీ శివాచార్యస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశేషమైన ఆరోగ్యప్రదాత, ఆనంద ప్రదాత భాస్కరుడు అని గ్రహబాధ ఉపశమనానికి భాస్కరునికి అర్చన చేస్తారని, సూర్యవ్రతంలో పాల్గొని భాస్కరుని కృపకు పాత్రులు కావాలని సూచించారు. తాము ఉచితంగా ఏర్పాటు చేసిన శ్రీసూర్యవ్రతంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదలకిచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వేగవంతంగా జరుగుతుంది. ఇప్పటి వరకు రామవరప్పాడులో 750, ప్రసాదంపాడులో సుమారు 1000, ఎనికేపాడులో 525, నిడమానూరులో 640 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. సెలవు రోజులతో పాటు అదనపు సమయం వెచ్చించి ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో మిగిలిన లబ్ధిదారులు తమ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచిస్తున్నారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 16న ఆందోళన

గన్నవరం: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన జరగనున్న దేశవ్యాప్త ఆందోళన చేపట్టనున్నట్లు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా కార్మికులు, రైతులు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వీటికి నిరసనగా దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా గ్రామీణ భారత్ నిరసనలలో అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాల నేతలు ముక్కామల ఉమామహేశ్వరరావు, చిన్నా, సూరగాని సాంబశివరావు, కాట్రగడ్డ జోషి, బి.నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూములకు రిజిస్ట్రేషన్లు

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం 2003వ సంవత్సరానికి ముందు పేదలకు పంపిణీ చేసిన అసైన్‌మెంట్ భూములకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తుందని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. నిషేధిత జాబితాలో నుంచి తొలగించి రెగ్యులర్ చేయడం వలన లబ్ధిదారులకు భూము లు విక్రయించుకునే సదుపాయం కలుగుతుందన్నారు. మండలంలో కొత్తూరు తాడేపల్లి, వేమవరం, షాబాదు, జక్కంపూడి గ్రామాల్లో 122 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. అనుమతులు రాగానే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు.